సాక్షి అనంతపురం

ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.20,100

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20,100 పలికాయి.



టమాట కిలో రూ.7

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.7 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.5 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం

37.8°/ 15.1°

జిల్లా అంతటా శనివారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి.. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఆరోగ్య శాఖలో ఖాళీలు భర్తీ చేస్తాం

- మంత్రి సత్యకుమార్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

అనంతపురం టవర్‌క్లాక్: ప్రభుత్వ ఆరోగ్య శాఖలో ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి గురించి ఎవరూ భయపడవద్దన్నారు. కావాల్సిన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కేంద్ర బడ్జెట్ సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడేలా ఉందన్నారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారన్నారు. రాబోయే రోజుల్లో కొత్త మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసి సీట్లు పెంచుతామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపరుస్తామన్నారు. ఎలాంటి రోగానికైనా వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొంతకాలం చికెన్ తినడం మానుకోవాలని సూచించారు. 'కూటమి'లో ఎటువంటి విభేదాలు లేవని, దీనిపై దుష్ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు లలిత్ కుమార్, చిరంజీవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అనుచరుల ఓవరాక్షన్

విలేకరుల సమావేశంలో మీడియా ప్రతినిధులపై మంత్రి సత్యకుమార్ అనుచరులు ఓవరాక్షన్ చేశారు. ఎంత సేపు ఇంటర్వ్యూ చేస్తారు అంటూ దురుసుగా మాట్లాడారు. ఈ విషయాన్ని మీడియా ప్రతినిధులు ఖండించగా.. మంత్రి సత్యకుమార్ క్షమాపణలు చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

సైబర్ మోసాలపై ఆటోల ద్వారా అవగాహన

అనంతపురం: సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి 70 ఆటోలను జిల్లా ఎస్పీ పి. జగదీష్ శనివారం ప్రారంభించారు. 'సైబర్ సురక్ష' కార్యక్రమంలో భాగంగా జిల్లా అంతటా ఆటోలు తిరుగుతాయన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఎలా వ్యవహరించాలో ఇప్పటికే వాహనాల ద్వారా వీడియోలను ప్రదర్శిస్తూ ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తున్నామన్నారు. పనుల్లో నిమగ్నమై డిజిటల్ వాహనాల ద్వారా ప్రదర్శించే వీడియోలు చూడలేని వారి కోసం తాజాగా టాంటాం ఆటోలను ప్రవేశపెట్టామన్నారు. జిలా కేంద్రంలో 17 ఆటోలు తిరుగుతాయని, మొత్తం జిల్లా అంతటా 70 ఆటోల ద్వారా ప్రచారం చేస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

కుంభమేళాకు ప్రత్యేక రైలు

రాయదుర్గంటౌన్: ఇది వరకే ప్రకటించిన షెడ్యూల్ మేరకు ఈ నెల 22, 25 తేదీల్లో శివమొగ్గ టౌన్ – వారణాసి (06223/06224) కుంభమేళాకు ప్రత్యేక రైలుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ బుకింగ్ సౌకర్యం అందుబాటులో ఉందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు 22న శివమొగ్గ టౌన్ నుంచి బయల్దేరి చిత్రదుర్గం, రాయదుర్గం, బళ్లారి కంటోన్మెంట్, హొస్పేట్ మీదుగా ప్రయాగ్‌రాజ్, వారణాసికి చేరుకుంటుంది. అలాగే తిరుగు ప్రయాణంలో 25న వారణాసిలో బయల్దేరి ఇదే రూట్‌లో రాయదుర్గం మీదుగా శివమొగ్గకు చేరుకుంటుంది. రాయదుర్గం ప్రాంత ప్రజలు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రయాణికుల భద్రతకు పటిష్ట చర్యలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం

గుంతకల్లు: రైలు ప్రయాణికుల భద్రతకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా పేర్కొన్నారు. డివిజన్‌లో తొలిసారిగా ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకోపైలట్ల కోసం ప్రత్యేకంగా ముద్రించిన పుస్తకాన్ని శనివారం డీఆర్ఎం సీఎస్ గుప్తా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైళ్ల రాకపోకలకు సంబంధించిన భద్రతా నిబంధనలు పాటించేందుకు పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థ వల్ల సమర్థవంతమైన నిర్వహణతోపాటు భద్రత, ఆపరేషనల్ సామర్థ్యం మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీఎస్‌టీఈ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ డీఓఎం శ్రావణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళామణి.. పోషకలేమి

- సమతుల ఆహారం తీసుకోని మహిళలు
- పోషకాహారమే వండుతున్నా తినడంలో మాత్రం వెనుకబాటు
- వేధిస్తున్న ఆరోగ్య సమస్యలు
- 'ఎన్ఎస్ఐ' పరిశీలనలో వెల్లడి



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఇంటిల్లిపాదికీ మంచి ఆహారం వండిపెట్టే ఇల్లాలు.. తను మాత్రం పోషకాహారం తీసుకోవడంలో వెనుకబడిపోతోంది. భర్త, పిల్లలకు రుచికరమైన, బలమైన ఆహారం వండిపెట్టే ఆమె..తాను తినడంలో కాస్త వెనక్కు తగ్గినట్టు తెలుస్తోంది. ఎన్ఎస్ఐ (న్యూట్రిషన్ సొసైటీ ఆఫ్ ఇండియా) ప్రతినిధులు జిల్లాలో తాజాగా చేసిన పరిశీలనలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. కేవలం 26 శాతం మహిళలే సరిపడా పౌష్టికాహారం తీసుకుంటున్నట్టు తేలింది. ఏరోజు ఏ వంట చేయాలో అంతా తన చేతిలోనే ఉన్నా తినేటప్పటికి రకరకాల కారణాలతో శరీరానికి చేరాల్సిన సమతుల ఆహారం చేరడం లేదు. అందుకే ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారిలో పురుషుల కంటే ఎక్కువమంది మహిళలే ఉన్నారని తేలింది. ఉమ్మడి జిల్లాలో పౌష్టికాహారం తీసుకోక చాలామంది మహిళలు రక్తహీనత బారిన పడుతున్నారు.

కూరగాయలు మాత్రం..

రోజూ కూరగాయలు తీసుకునే వాళ్లలో మహిళల సంఖ్య పురుషుల కంటే కాస్త ఎక్కువగా ఉంది. బీన్స్, చిక్కుళ్లు, క్యాబేజీ, క్యారెట్ వంటి కూరగాయలు రోజూ తీసుకునే మహిళలు 24.6 శాతం మంది ఉన్నారు. పురుషుల విషయానికి వస్తే 19.6 శాతం మాత్రమే ఉండటం గమనార్హం. అదే చికెన్ లేదా మటన్ రోజూ తినేవారిలో పురుషులు 1.4 శాతం ఉండగా, మహిళల పరంగా కేవలం 0.5 శాతం ఉంది. వారానికోసారి మాంసం తినే వారి పరంగా మహిళలు 64.2 శాతం ఉండగా, పురుషులు 71 శాతం ఉన్నట్టు తేలింది. కోడిగుడ్లు తినే విషయంలో మహిళలే కాస్త ముందంజలో ఉన్నారు. రోజూ గుడ్లు తినేవారిలో 5.4 శాతం మహిళలు, 3.5 శాతం పురుషులు ఉన్నారు. మొత్తం మీద రకరకాల పోషకాహారం తినేవారిలో పురుషులే ఎక్కువగా ఉన్నట్టు తేలింది.

వేధిస్తున్న రక్తహీనత..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు 56 శాతం ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. అవగాహన లేక సమతుల ఆహారం తీసుకోలేక పోతున్నారు. రుతుక్రమం, గర్భం దాల్చడం వంటి కారణాల పరంగా ఎక్కువ పోషకాహారం తీసుకోవాల్సి ఉన్నా, గ్రామీణ ప్రాంత మహిళల్లో అంత అవగాహన లేదు. ఏ కూరగాయల్లో ఏముంటుంది, ఏ ఆకుకూరలు ఎప్పుడు తినాలి వంటి విషయం తెలీక రక్తహీనత బారిన పడుతున్నారు.

సమతుల ఆహారం తీసుకోవాలి



ప్రస్తుత రోజుల్లో గర్భం దాల్చిన వారు తక్కువ బరువుతో ఉంటున్నారు. గర్భ నిర్ధారణ అయ్యాక మొదటి మూడు నెలలు వాంతులతో తక్కువ ఆహారం తీసుకుంటుంటారు. ఇటువంటి సమయంలో తక్కువ మోతాదులోనే పౌష్టికాహారం తీసుకోవాలి. ఆకుకూరలు, బఠానీ, చిక్కి, పాలు, పెరుగు, తక్కువ మోతాదులో నాన్‌వెజ్ తినాలి. గర్భధారణ సమయంలో 10 కేజీల వరకు బరువు పెరిగేలా ప్రణాళిక చేసుకోవాలి.

– డాక్టర్ షంషాద్ బేగం, గైనకాలజిస్టు

వివిధ ఆహార పదార్థాలు తీసుకునే వారి శాతమిలా..

ఆహారం	మహిళలు (రోజువారీ)	మహిళలు (వారానికి)	పురుషులు (రోజువారీ)	పురుషులు (వారానికి)
కూరగాయలు	24.6	68.9	19.6	74.3
ఆకుకూరలు	11.9	64.3	12.9	75.7
పండ్లు	9.3	37.8	8.2	53.1
గుడ్లు	5.4	68.4	3.5	76.4
చేపలు	1.5	38.5	1.5	48.8
చికెన్/మటన్	0.5	64.2	1.4	71.0
చికెన్/మటన్/చేపలు	1.7	69.5	2.4	75.8
వేపుడు ఆహారం	3.9	29.4	2.5	36.1

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ స్పందించాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన అనతి కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, యువతులు, బాలికలపై అఘాయిత్యాలు అధికమయ్యాయన్నారు. ఇటీవల అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం ప్యారంపల్లికి చెందిన గౌతమి పట్ల టీడీపీ నాయకుని కుమారుడు గణేష్ అమానుషంగా ప్రవర్తించడం దారుణమన్నారు. యాసిడ్ తాగించి, కత్తితో దాడి చేయడం బాధాకరమన్నారు. అధికార మదంతోనే ఇటువంటి దారుణాలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు జరుగుతుంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. శాంతి భద్రతలను కాపాడటంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. దాడి ఘటనపై సీఎం, డిప్యూటీ సీఎంలు స్పందించాలని డిమాండ్ చేశారు. పోలీసు శాఖ మరింత అప్రమత్తం కావాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో తెలంగాణ ప్రాంతంలో యువతిపై అత్యాచారం జరిగితే ఆంధ్రప్రదేశ్‌లో ఏ మహిళకు అటువంటి పరిస్థితి తలెత్తకూడదని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 'దిశ' పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మహిళలకు రక్షణ కల్పించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పటిష్ట చర్యలు తీసుకున్నారన్నారు. నేడు మహిళలపై దాడులు జరుగుతున్నా కూటమి ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తోందని దుయ్యబట్టారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి తప్పక బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

క్లస్టర్ సమావేశాలు.. కష్టాలు

- క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణలో అవస్థలు
- సాయంత్రం 5.30 వరకూ అటెండెన్స్ పడకుండా యాప్‌లాక్
- సర్కారు తీరుపై టీచర్ల ఆగ్రహం



ప్రభుత్వ తీరుపై నిరసన తెలియజేస్తున్న గోళ్ల క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు

అనంతపురం ఎడ్యుకేషన్: క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు టీచర్లకు చుక్కలు చూపించాయి. కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకున్న నిర్ణయంలో భాగంగా శనివారం జిల్లాలో 135 చోట్ల కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి. ఉదయం తాము పని చేస్తున్న పాఠశాలలకు వెళ్లిన టీచర్లు.. 11.45 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టి ఇళ్లకు పంపారు. 12 గంటల నుంచి కాంప్లెక్స్ స్కూళ్లకు బయలుదేరారు. 25–30 కిలోమీటర్ల దూరంలో ఉండే కాంప్లెక్స్ స్కూళ్లకు వెళ్లేందుకు అయ్యవార్లు నానా తంటాలు పడ్డారు. మరీ ముఖ్యంగా మహిళా టీచర్లు రవాణా సదుపాయం లేక నరకయాతన అనుభవించారు. కొన్ని చోట్ల ప్రైవేట్ వాహనాలను అద్దెకు తీసుకుని వెళ్లగా.. మరికొన్ని కోట్ల ఉదయం పని చేస్తున్న పాఠశాలల్లో కొందరు టీచర్లు అటెండెన్స్ వేసి 11 గంటలకే బయలుదేరి వెళ్లారు.

అటెండెన్స్ యాప్‌లాక్..

వాస్తవానికి సాయంత్రం 5 గంటల వరకు సమావేశాలుంటాయని షెడ్యూలు విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు పని చేస్తున్న పాఠశాలలో (ఇన్‌టైమ్) అటెండెన్స్ వేయాలని, మధ్యాహ్నం 12.45 నుంచి 1.30 గంటలలోపు క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌లో (ఇన్ టైమ్), అక్కడే సాయంత్రం 5 గంటల నుంచి (అవుట్‌టైమ్) వేయాల్సి ఉంటుందని ప్రకటించారు. అయితే 5.30 గంటల వరకు అటెండెన్స్ పడకుండా యాప్‌లో లాక్ చేయడంతో టీచర్లు బెంబేలెత్తిపోయారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న సీనియర్ ఉపాధ్యాయుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. దీనికితోడు ఉదయం 6–7 గంటలకు మొబైళ్లకు చార్జింగ్ పెట్టుకున్న టీచర్లు సాయంత్రం 6 గంటలైనా అటెండెన్స్ తీసుకోకపోవడంతో చార్జింగ్ లేక అవస్థలు పడ్డారు. ఈ క్రమంలో ప్రభుత్వ తీరుపై కళ్యాణదుర్గం మండలం గోళ్ల పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు.

చాలా దుర్మార్గం..

క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణలో ప్రభుత్వం వింత నిర్ణయాలు తీసుకుని ఉపాధ్యాయులను తీవ్ర అవస్థల్లోకి నెట్టిందని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడ్డారు. టీచర్ల పట్ల ప్రభుత్వం చాలా దుర్మార్గంగా వ్యవహరించిందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు గంగాధర్ రెడ్డి, గోవింద రెడ్డి, రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీలూరి రమణారెడ్డి, ఎస్.రామాంజనేయులు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గొని పాతిరెడ్డి, జిల్లా అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు రాయల్ వెంకటేష్, సయ్యద్ సిరాజుద్దీన్, ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి డెగావత్ రవీంద్రనాథ్ శనివారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. పాఠశాల సమయం 4 గంటలకు ముగించాల్సి ఉండగా కాంప్లెక్స్ మీటింగ్ పేరుతో 5 గంటల వరకు పెంచారన్నారు. అయితే 5.30 గంటల వరకు అటెండెన్స్ పడకుండా చేయడం అమానుషమని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనైనా సాయంత్రం 4 గంటల వరకే కుదించాలని వారు డిమాండ్ చేశారు.

రైతుకు భరోసా అందించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: కూటమి ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఆకాశవాణి అనంతపురం కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ క్యాంపస్‌లోని డీపీఆర్‌సీ భవన్‌లో శనివారం నిర్వహించిన రేడియో రైతు దినోత్సవానికి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కలెక్టర్ వినోద్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. దేశానికి వెన్నెముక లాంటి రైతులకు వెన్నుదన్ను లేకుండాపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. టీవీ, నెట్, మొబైల్ లేని రోజుల్లో రైతన్నలకు దిక్సూచిగా నిలిచింది రేడియో ఒక్కటేనన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, మ్యుటేషన్లు, కబ్జాలు తదితర సమస్యలపై రైతులు గ్రామ సచివాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. తాను కూడా ప్రతి రోజూ ఒక్కో మండలానికి వెళ్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయం లాభసాటిగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అంతకుముందు జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, కలెక్టర్‌లు తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిలో డీపీఆర్‌సీ భవన్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో డీఏఓ ఉమామహేశ్వరమ్మ, రైతులు, అధికారులు పాల్గొన్నారు.



వ్యవసాయ యంత్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే ప్రసాద్ తదితరులు

రేపు 'దుర్గం'లో 'పరిష్కార వేదిక'

అనంతపురం అర్బన్/రాయదుర్గం: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' జిల్లాస్థాయి కార్యక్రమాన్ని ఈనెల 17వ తేదీ (సోమవారం) రాయదుర్గం పట్టణంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాయదుర్గం డ్వామా ఏపీడీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. తనతో పాటు జేసీ, డీఆర్ఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టరేట్‌లో కార్యక్రమం నిర్వహించడం లేదని, ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

ఎన్నికల విభాగం... అంతా మా ఇష్టం!

- ఎన్నికల నిధుల దుర్వినియోగం
- ఇష్టారాజ్యంగా బీఎల్ఓలకు రెమ్యునరేషన్
- విజయవాడ వెళ్లినప్పుడల్లా ఓ ఉద్యోగి డబ్బు వసూలు
- సరెండర్ డీఈఓకి సంఘం నాయకుడు సపోర్ట్
- తీవ్ర విమర్శలకు దారి తీస్తున్న అధికారుల వ్యవహారాలు



కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగం

అనంతపురం అర్బన్: జిల్లా ఎన్నికల విభాగం అవకతవకలకు కేంద్రంగా మారింది. ఎన్నికల నిధులను ఇష్టారాజ్యంగా పంచడం.. విజయవాడలోని ప్రధాన ఎన్నికల కార్యాలయానికి వెళ్లిన ప్రతిసారి ఓ ఉద్యోగి డబ్బులు వసూలు చేస్తుండటం... అక్రమాలకు పాల్పడి సరెండర్ అయిన ఓ డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకుడు సపోర్ట్ చేయడం తదితర వ్యవహారాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

యథేచ్ఛగా చెల్లింపులు..

2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు విడతల వారీగా కోట్ల రూపాయల నిధులను అప్పట్లోనే ప్రభుత్వం విడుదల చేసింది. ఈ క్రమంలోనే బూత్ లెవల్ అధికారులకు రెమ్యునరేషన్ చెల్లింపులో ఎన్నికల విభాగం అధికారులు వివాదానికి తెరతీసినట్లు తెలిసింది. జిల్లాలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో మూడవ త్రైమాసికానికి సంబంధించి 3,750 మంది బీఎల్ఓలకు రూ.750 చొప్పున, నాల్గో త్రైమాసికానికి రూ.1,500 చొప్పున రూ.84,37,500 చెల్లించాల్సి ఉంది. అలాగే 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాలుగు త్రైమాసికాలకు కలిపి ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున 2,198 మందికి రూ. 1.31 కోట్లు, 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడు త్రైమాసికాలకు కలిపి ఒక్కొక్కరికి రూ.4,500 చొప్పున రూ.99,58,500 చెల్లించాలి. 2021–22లో బీఎల్ఓలుగా పనిచేసిన వారిలో కొందరు 2022–23, 2023–24లో ఆ విధులు నిర్వర్తించలేదు. కానీ, 2021–22లో బీఎల్ఓలుగా పనిచేసిన వారిలో చాలా మందికి రెమ్యునరేషన్ ఇవ్వకుండా ప్రస్తుతం ఉన్నవారికే ఇష్టారాజ్యంగా చెల్లించినట్లు తెలిసింది.

డబ్బుల వసూలు..

ఎన్నికల విధుల్లో భాగంగా విజయవాడలోని ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి నివేదికలు తీసుకుని జిల్లా ఎన్నికల విభాగానికి సంబంధించి ఉద్యోగులు వెళతారు. దీన్ని ఆసరాగా చేసుకున్న ఒక ఉద్యోగి వసూళ్లకు తెరలేపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయవాడ వెళ్లే ప్రతిసారీ డీటీల నుంచి రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తారని సమాచారం. డబ్బు ఇవ్వకపోతే 'మీరే వెళ్లండని' అంటుండడంతో చేసేదిలేక సమర్పించుకున్నట్లు తెలిసింది.


అక్రమార్కుడికి సపోర్ట్..

గత ఎన్నికల సమయంలో ఓటర్ల తొలగింపునకు (ఫారం–7) సంబంధించి రాప్తాడుకు చెందిన డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఈఓ) అవకతవకలకు పాల్పడటంతో అతడిని అప్పట్లోనే సరెండర్ చేశారు. అయితే ఆ ఉద్యోగిని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుమతి లేకుండానే కలెక్టరేట్‌లో నియమించుకున్నారు. వ్యవహారం బయటికి రావడంతో ఇటీవల పంపించేశారు. అక్రమాలకు పాల్పడిన సదరు ఉద్యోగికి రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకుడు ఒకరు సపోర్ట్ చేస్తున్నట్లు తెలిసింది. డీఈఓ చేసిన తప్పును వదిలేసి... ఆ విషయాన్ని బయటికి ఎవరు చెప్పారు అంటూ సదరు నాయకుడు అందరినీ బెదిరిస్తున్నట్లు తెలిసింది. ఇలా ఎన్నికల విభాగంలో నడుస్తున్న అడ్డగోలు వ్యవహారాలు తీవ్ర విమర్శలకు దారితీస్తున్నాయి.

జేసీ అంతర్గత విచారణ..

ఎన్నికల నిధుల దుర్వినియోగంపై జేసీ శివ్ నారాయణ్ శర్మ అంతర్గత విచారణ చేపట్టినట్లు సమాచారం. అప్పట్లో నియోజకవర్గాల ఈడీటీలు(ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు)గా విధులు నిర్వర్తించిన వారిని జాయింట్ కలెక్టర్ నాలుగు రోజుల క్రితం పిలిపించి విచారణ చేసినట్లు తెలిసింది. దీనిపై ఆయన సమగ్ర నివేదిక సిద్ధం చేసి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారికి త్వరలో సమర్పించనున్నారు.

ప్రత్యేక దృష్టి సారిస్తా



ఎన్నికల విభాగం వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి సారిస్తా. బీఎల్ఓలకు రెమ్యునరేషన్ చెల్లింపులను పరిశీలిస్తా. ఎన్నికల విధులు నిర్వర్తించిన ప్రతి బీఎల్ఓకు రెమ్యునరేషన్ అందేలా చర్యలు తీసుకుంటా.

– వి.వినోద్‌కుమార్, కలెక్టర్

'చెత్తతో సంపద తయారీ'తో ఆదాయం

పామిడి: చెత్తతో సంపద తయారీ కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని వంకరాజుకాలువ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణ సక్రమంగా చేపట్టాలన్నారు. ఆదాయంతో పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టవచ్చన్నారు. కలెక్టర్ వెంట మెప్మా పీడీ విజయలక్ష్మి, ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓఆర్డీ కృష్ణకుమార్, డీటీ లక్ష్మీనారాయణరెడ్డి, రీసర్వే డీటీ విజయ్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు,

కలెక్టర్‌కు సమస్యల ఏకరువు...

వంకరాజుకాలువలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులు కలెక్టర్ ఎదుట ఏకరువు పెట్టారు. పెన్నప్పగుడి నుంచి గ్రామానికి ఉన్న తారు రోడ్డు గుంతలమయం కావడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందన్నారు.గ్రామంలోని తాగునీటి ట్యాంకులు శిథిలావస్థకు చేరడంతో నీరు వృథా అవుతోందన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు

అనంతపురం అర్బన్: గర్భస్థ లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. వంకరాజు కాలువ గ్రామ సచివాలయం నుంచి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేయాలన్నారు. కర్ణాటక సరిహద్దు మండలాల్లో చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి రూరల్: రజాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయ తెలిపారు. 2025–26 సంవత్సరానికి బీఆర్ఏజీ సెట్–2025 ప్రవేశ పరీక్ష ద్వారా ఇంగ్లిష్ మీడియంలో ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్ ఫస్టియర్ బైపీసీలో 40, ఎంపీసీలో 40 సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. మార్చి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 93916 39001 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఒంటరి వృద్ధులే టార్గెట్

- కుదిరితే చోరీ.. లేకుంటే హత్య
- కసాయిని అరెస్ట్ చేసిన పోలీసులు
- బంగారు నగలు, నగదు స్వాధీనం



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను చూపుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: ఒంటరిగా నివసిస్తున్న వృద్ధులే టార్గెట్. రెక్కీ నిర్వహించి మరీ చోరీలకు పాల్పడడం.. అవసరమైతే హత్యకు తెగబడడం. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న ఓ కసాయిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ పి.జగదీష్ శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో పొమ్మల సావిత్రి (63) సొంతింటిలో ఒంటరిగా నివసిస్తోంది. ఈమె భర్త ఆటవీశాఖలో ఉద్యోగ విరమణ చేసిన కొన్నాళ్లకు చనిపోయారు. ఈమెకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. వేరుగా కాపురం ఉంటున్నారు. సావిత్రి తన భర్త పెన్షన్ సొమ్ముతో ఒంటరిగా నివసిస్తోంది. ఈ క్రమంలో గత జనవరి నెల ఆరో తేదీన ఆమె ఇంటిలోనే హత్యకు గురైంది. పదునైన ఆయుధంతో గొంతుకోసి చంపేసిన ఆనవాళ్లు ఉండడంతో పాటు మెడలోని ఉండాల్సిన రెండు బంగారు చైన్లు, సెల్‌ఫోన్ కనిపించలేదు. కుమారుడు విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నేరస్థలంలో క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ల ద్వారా ఆధారాలు సేకరించారు. రక్త సంబంధీకులు, ఇరుగు పొరుగు వారిని పోలీసులు విచారణ చేశారు. అనంతరం మూడు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి.. సీసీ కెమెరాలు ఫుటేజీలు పరిశీలించి అనంతపురం పాతూరు నీరుగంటివీధికి చెందిన షేక్ అన్సర్ అలియాస్ చీమిడోడు అలియాస్ నాకులు అలియాస్ చాబూసాను నిందితుడిగా గుర్తించారు.

రెక్కీ నిర్వహించి.. హత్య చేసి..

షేక్ అన్సర్ వెల్డింగ్ వర్కర్. ఇతడు తాగుడు, వ్యభిచారం, తదితర చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. వ్యసనాలు తీర్చుకునేందుకు అప్పులు చేశాడు. అయితే తిరిగి చెల్లించడానికి తగినంత ఆదాయం లేకపోవడం.. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు పెరిగిపోవడంతో డబ్బు కోసం తప్పుడు మార్గం ఎంచుకున్నాడు. ఒంటరిగా నివసిస్తున్న వృద్ధుల్ని లక్ష్యంగా చేసుకుని.. వారి వద్ద నుంచి విలువైన ఆభరణాలు, నగదు కాజేయాలని అనుకున్నాడు. ఇందులో భాగంగా రెక్కీ నిర్వహించిన తర్వాత జనవరి ఆరో తేదీన టీచర్స్ కాలనీలో టూలెట్ బోర్డు ఉన్న సావిత్రి ఇంటికి వెళ్లాడు. తనకు ఇల్లు బాడుగకు కావాలని వివరాలు అడిగిన తర్వాత తాగునీరు అడిగాడు. ఆమె లోనికి వెళ్లగానే అన్సర్ తన వెంట తెచ్చుకున్న స్టిక్కర్ బ్లేడ్‌తో గొంతు కోసి హత్య చేశాడు. ఆమె మెడలోని 25 గ్రాముల బంగారు చైను, 16 గ్రాముల పగడాల బంగారు చైను, రెడ్‌మీ సెల్‌ఫోన్ తీసుకుని పరారయ్యాడు. ఈ క్రమంలో శనివారం చెరువుకట్ట వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ కె.సాయినాథ్, సీసీఎస్ సీఐ జయపాల్‌రెడ్డి, ఎస్ఐలు రాంప్రసాద్, రాజశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిందితుడిని అరెస్ట్ చేశారు. ఇదిలా ఉండగా ఈ నెల తొమ్మిదో తేదీన అనంతపురం రూరల్ మండలం కురుగుంటలోని ఓ ఇంట్లో కూడా షేక్ అన్సర్ చోరీకి పాల్పడ్డాడు. రూ.34,500 చోరీ నగదును నిందితుడి నుండి స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదింపులో శ్రమించిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

ఎన్నికలెప్పుడొచ్చినా కూటమికి ఓటమే

- గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: ఎన్నికల హామీలను గాలికొదిలేసి ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిన కూటమికి ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఓటమి తప్పదని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి జోస్యం చెప్పారు. శనివారం గుంతకల్లులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్ జగన్ హయాంలో విద్య, వైద్యం, వ్యవసాయరంగాల్లో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులతో ఆయా రంగాలు అభివృద్ధి చెందాయన్నారు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం వాటిని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. తాను సంపద సృష్టికర్తనని చెప్పుకునే చంద్రబాబు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను చెల్లించలేని దౌర్భాగ్య స్థితిలో పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. రైతుభరోసా, తల్లికి వందనం, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలకు కూడా నిధులివ్వడానికి ఆర్థిక ఇబ్బందులను సాకు చూపుతున్న చంద్రబాబు తమ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధుల జేబులు నింపడానికి మాత్రం పనిచేస్తున్నారని విమర్శించారు. సొంతింటి కల సాకారం చేయాలన్న లక్ష్యంతో జగనన్న ప్రభుత్వ హయాంలో పేదలకు ఇంటి స్థలాలిస్తే కొందరు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇళ్లు నిర్మించుకోలేదని, అలాంటి వారి స్థలాలను కూటమి సర్కారు రద్దు చేస్తామంటే ఒప్పుకునేది లేదన్నారు. ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసి ప్రభుత్వం మద్యాన్ని మాత్రం ఏరులై పారిస్తోందని మండిపడ్డారు. బడులు, దేవాలయాల కంటే ముందే మద్యం షాపులను తెరిచి ఇష్టారాజ్యంగ సొంత బ్రాండ్‌లను విక్రయిస్తూ మద్యం ప్రియుల ఆరోగ్యాన్ని పాడు చేస్తున్నారని ఆయన నిప్పులు చెరిగారు. తిరుపతి జనసేన పార్టీ ఇన్‌చార్జ్ ఓ మహిళను హింసించి మోసం చేసినా.. ఆయనపై చర్యలు తీసుకోవడానికి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకెళ్తామన్నారు. శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్ నుంచి గుంతకల్లు చేరుకున్న తనకు అపూర్వస్వాగతం పలికిన ప్రతి ఒక్కరికీ వైవీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఖలీల్, రాము, కౌన్సిలర్లు లింగన్న, సుమోబాష, కోఆప్షన్‌సభ్యుడు ఫ్లయింగ్ మాబు, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ యుగంధర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఎస్వీఆర్.మోహన్, సీనియర్ నాయకులు నూర్‌నిజామి, గోవింద్‌నాయక్, జయరామిరెడ్డి, పార్టీ అనుబంధ విభాగాల నియోజకవర్గం అధ్యక్షులు అబ్దుల్‌బాసిద్, వీరేష్, అంజి, షాబుద్దీన్, బాబూరావు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కలెక్టరేట్ ఆవరణలో స్వచ్ఛ దివస్ నిర్వహిస్తున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బందితో కలిసి జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులచేత స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో చీపుర్లతో చెత్త శుభ్రం చేశారు. జేసీ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అధికారులు, ఉద్యోగులు కార్యాలయంలోని తమ విభాగాలు, పరిసరాలను పరిశ్రుభంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎ.మలోల, పరిపాలనాధికారి అలెగ్జాండర్, ఇతర విభాగాధిపతులు వసంతలత, రియాజుద్దీన్, వాణిశ్రీ, యుగేశ్వరిదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు నీటి సరఫరా పునరుద్ధరణ

కళ్యాణదుర్గం: శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా ఎట్టకేలకు శుక్రవారం అర్ధరాత్రి పునరుద్ధరించారు. ఈఈ మురళీధరరావు, డీఈఈ శిరీష గంగవరం వద్ద ఉన్న పంప్‌హౌస్‌లో కాలిపోయిన విద్యుత్ మోటర్లను స్థానిక ఇంజినీర్ల సాయంతో మరమ్మతులు చేయించారు. దీంతో అర్ధరాత్రి పంపులు ఆన్‌చేయగా శనివారం ఉదయం నుంచి శ్రీరామిరెడ్డి తాగునీరు గ్రామాలకు యథావిధిగా సరఫరా అయినట్లు అధికారులు తెలిపారు.

గాయపడిన యువకుడి మృతి



మృతుడు నరేష్

పెద్దవడుగూరు/ గుంతకల్లు రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంతకల్లు మండలం కదిరంపల్లికి చెందిన నరేష్ (32) ఈ నెల 12న పెద్దవడుగూరు మండలం లక్షుంపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మార్గం మధ్యలో అడవిపందుల గుంపు అడ్డు వచ్చింది. దీంతో అదుపుతప్పి బైక్‌పై నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన నరేష్‌ను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పెద్దవడుగూరు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

దారిలో పడిపోయిన బంగారు నగల బ్యాగు

- 10 నిమిషాల్లోనే రికవరీ చేసిన పోలీసులు



బంగారు నెక్లెస్‌ను చూపుతున్న బాధితురాలు కవిత

తాడిపత్రి టౌన్: ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో దారి మధ్యలో పడిపోయిన బంగారు నగల హ్యాండ్‌బ్యాగును పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పది నిమిషాల్లో కనుక్కొని బాధితురాలికి అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పోరాట కాలనీకి చెందిన కవిత తన తల్లి లక్ష్మీ తో కలిసి శనివారం రాయదుర్గం వెళ్లేందుకు ఇంటి నుంచి ఆటోలో బస్టాండ్‌కు బయల్దేరారు. కొంత నగదుతో పాటు బంగారు నెక్లెస్, చైన్‌ను భద్రపరచిన హ్యాండ్‌బ్యాగును దుస్తుల సంచిపై పెట్టుకుంది. బస్టాండ్‌కు వెళ్లిన తర్వాత చూస్తే హ్యాండ్‌బ్యాగ్ కనిపించలేదు. దీంతో కవిత ఏడుస్తూ నేరుగా పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఐ సాయిప్రసాద్‌కు జరిగిన విషయం చెప్పింది. అదే బ్యాగులో తన సెల్‌ఫోన్ కూడా ఉందని తెలపడంతో అప్రమత్తమైన పోలీసులు లొకేషన్‌ను కనుగొని బాధితురాలిని బైక్‌పై ఎక్కించుకుని ఆ ప్రదేశానికి బయల్దేరారు. చింతల వెంకటరమణస్వామి ఆలయ సమీపంలో బేకరీ నిర్వహిస్తున్న నాగమణి వద్ద ఆ బ్యాగు లభించింది. బ్యాగు దొరికిన వెంటనే పోలీసులకు అప్పగించాలి కదమ్మా అని పోలీసులు ప్రశ్నిస్తే.. ఈ రోజు ఇంట్లో ఎవ్వరూ మగవారు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు రాలేక పోయానని నాగమణి చెప్పి.. బ్యాగు అందజేసింది. బ్యాగులో బంగారు నగలు, నగదు అన్నీ భద్రంగా ఉండడంతో కవిత ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. పోలీసులకు, బ్యాగు అందజేసిన నాగమణికి ఆమె కృతజ్ఞతలు తెలియజేసింది.

వడ్డీ వ్యాపారుల వేధింపులపై కేసు

గార్లదిన్నె: అధిక వడ్డీల కోసం మహిళను వేధిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన శనివారం మీడియాకు వెల్లడించారు. కోటంక గ్రామానికి చెందిన కుళ్లాయమ్మ అనే మహిళ తన పెళ్లికి ముందు అనంతపురంలో ఫిజియోథెరపిస్టుగా పనిచేస్తుండేది. రెండేళ్ల క్రితం అనంతపురంలోని రాణీనగర్‌కు చెందిన మణికుమార్ వద్ద అవసరాల నిమిత్తం వారానికి నూటికి రూ.10 వడ్డీతో రూ.1.50 లక్షలు అప్పు తీసుకుంది. తన బంగారు ఆభరణాలు అమ్మి అసలు, వడ్డీ కలిపి రూ.3లక్షలు చెల్లించింది. పెళ్లయిన తర్వాత భర్త సురేష్‌రెడ్డిని బెదిరించి అప్పు ఇంకా తీరలేదని గత ఏడాది జూలైలో రూ.5.30లక్షలకు ప్రాంసరీ నోటు రాయించుకున్నారు. అంతేకాదు బాండ్ పేపర్ మీద సంతకం చేయించుకున్నారు. అప్పటి నుంచి డబ్బు కోసం వేధిస్తూనే ఉన్నారు. స్వగ్రామం కోటంకకు వెళ్లినా అక్కడకూ కొంతమంది మహిళలు వెళ్లి అప్పు తీర్చాలంటూ కుళ్లాయమ్మను బెదిరించారు. వడ్డీ వ్యాపారి మణికుమార్, అతని భార్య మణి, తల్లి కొత్తమ్మ నుంచి ప్రాణహాని ఉందని కుళ్లాయమ్మ గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆ ముగ్గురిపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

యూజీసీ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి




మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్

అనంతపురం ఎడ్యుకేషన్: వైస్ చాన్సలర్ల నియామక నిబంధనలను పూర్తిగా మారుస్తూ కేంద్రం విడుదల చేసిన యూజీసీ డ్రాఫ్ట్ -2025 నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత విద్యావ్యవస్థలో ఊహించడానికి కూడా సాధ్యం కాని మార్పులను కేంద్రం తలపెట్టిందన్నారు. వాటిలో అత్యంత కీలకమైనవి వీసీ నియామకాలన్నారు. వీసీల ఎంపికకు సంబంధించి విద్యాపరమైన అర్హతలను సడలించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం ప్రైవేట్ రంగానికి చెందిన వారితో పాటు ఎలాంటి అకడమిక్ అనుభవం లేని వారిని కూడా వైస్ చాన్సలర్లుగా నియమించే అవకాశం ఉందన్నారు. సెర్చ్ కమిటీలు, అధ్యయనాల పరిశీలనలు కూడా ఉండవన్నారు. గవర్నర్ ఆధ్వర్యంలోనే కీలకమైన టీచింగ్,నాన్ టీచింగ్ సిబ్బందికి సంబంధించిన నియామకాలు జరుగుతాయన్నారు. కార్పొరేట్ శక్తుల చేతుల్లో యూనివర్సిటీలను పెడితే విద్యా వ్యవస్థ కుంటుపడే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఆర్టికల్ 66 ప్రకారం ఉన్నత విద్యాలయాలు, పరిశోధనా సంస్థలకు మధ్య సమన్వయం చేయడానికి ప్రమాణాలను నిర్దేశించడానికి మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉంటుందని గుర్తు చేశారు. సమావేశంలో విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు కైలాష్, నాయకులు వెంకట్, బోయ నితిన్, రాహుల్ రెడ్డి, బోయ శ్రీనివాస్, శివ, శారిక్, సూర్య రెడ్డి, సురేష్, సాయి పాల్గొన్నారు.

ఆగని జేసీ కక్ష సాధింపులు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి భవనం కూల్చివేత



రమేష్‌రెడ్డి భవనం కూలుస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: వైఎస్సార్‌సీపీ నాయకులపై తాడిప్రతి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కక్షసాధింపు చర్యలు ఆగడం లేదు. పట్టణంలోని పుట్లూరు రోడ్డులో శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డికి చెందిన నిర్మాణంలో ఉన్న భవనాన్ని మున్సిపల్ అధికారులు హిటాచీతో కూల్చివేశారు. రెండు నెలల క్రితం ఇదే భవనాన్ని కూల్చిన అధికారులు మరోసారి కూల్చి జేసీపై స్వామి భక్తి చాటుకున్నారు. విషయం తెలుసుకున్న రమేష్‌రెడ్డి నేరుగా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్‌తో మాట్లాడే ప్రయత్నం చేసినా 10 నిమిషాలు వేచి ఉండాలని చెప్పి ముఖం చాటేశారు. చేసేది లేక ఫోన్ చేసి భవనాన్ని ఎందుకు కూల్చారని ప్రశ్నిస్తే తనకు తెలియదని చెప్పారు. తర్వాత ఫోన్ స్విచాఫ్ చేసేశారని రమేష్‌రెడ్డి ఆరోపించారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఒత్తిళ్ల కారణంగానే నోటీసులు ఇవ్వకుండా, సమస్యను చెప్పకుండా భవన నిర్మాణాన్ని కూలగొడుతూ భయభ్రాంతుకు గురిచేస్తున్నారని రమేష్ రెడ్డి ఆరోపిస్తున్నారు.

గుళ్లు తిరిగేందుకేనా డిప్యూటీ సీఎం పదవి?

- పవన్ కల్యాణ్‌పై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి మండిపాటు

అనంతపురం అర్బన్: పరిపాలన పక్కన పెట్టి గుళ్లు, గోపురాలు తిరిగే డిప్యూటీ ముఖ్యమంత్రి రాష్ట్రానికి అవసరమా అంటూ పవన్‌కల్యాణ్‌పై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. శనివారం అనంతపురం విచ్చేసిన ఆయన స్థానిక ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రశ్నిస్తానన్న పవన్ కల్యాణ్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. తమకేదో మంచి చేస్తారని నమ్మి ఓటు వేసిన ప్రజలను పవన్ కల్యాణ్ పట్టించుకోకుండా, పాలన గాలికొదిలేసి గుళ్లు, గోపురాలు తిరుగుతున్నారని విమర్శించారు. సాధారణంగా పదవీ విరమణ చేసిన వారు, వయసు పైబడిన వారు ఆలయాలు సందర్శిస్తూ కాలం గడుపుతారన్నారు. ఆలయాలపై ఆసక్తి ఉంటే దేవదాయ శాఖ తీసుకుంటే సరిపోయేదన్నారు. అప్పుడు ఎన్ని ఆలయాలు తిరిగినా ఎవరూ అడగరన్నారు. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు తప్ప మిగిలిన ఏ వర్గాల ప్రజలకూ మేలు చేసేదిగా లేదని విమర్శించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫార్మసీ రంగంలోనూ ఏఐ కీలక పాత్ర



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేఎన్‌టీయూ(ఏ) ఇన్‌చార్జ్ వీసీ సుదర్శన రావు

అనంతపురం: ఫార్మసీ రంగంలోనూ ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కీలక పాత్ర పోషిస్తుందని జేఎన్‌టీయూ(ఏ) ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు అన్నారు. ఓటీపీఆర్ఐలోని 2024 బ్యాచ్ ఫార్మాడీ మొదటి సంవత్సరం విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలికే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఫార్మాడీ కోర్సుకు అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట ప్రాధాన్యత ఉందన్నారు. అందుకు తగ్గట్టుగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కోరారు. ఫార్మసీ రంగం గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల ఉన్నతికి కారణమైన కళాశాల, గురువులను గుర్తు పెట్టుకోవాలని సూచించారు. క్లినికల్ రీసెర్చ్ రంగంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్డీటూ వీసీ ప్రొఫెసర్ ఓ.దేవన్న ,ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చక్కా గోపీనాథ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

అనంతపురం రూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ కేశవ నాయుడు హెచ్చరించారు. శనివారం ఆర్డీఓ కార్యాలయంలో గర్భస్థ, పిండ లింగ నిర్ధారణ చట్టంపై డివిజనల్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కేశవనాయుడు మాట్లాడుతూ.. గర్భస్థ పిండ, లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో సెక్స్ డిటెక్షన్ జరగకుండా నిఘా ఉంచాలన్నారు. ఆడపిల్లల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న, డాక్టర్ శంకర్ నారాయణ, డీపీఆర్ఓ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



నియామక పత్రాలు అందజేస్తున్న ఎంబీఏ విభాగాధిపతి ప్రొఫెసర్ మురళీకృష్ణ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఎంబీఏ విభాగంలో జాయ్‌అలకాస్ కంపెనీ వారు శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్కేయూ ఎంబీఏ విద్యార్థులు ఇద్దరు, అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విద్యార్థులు 20 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎస్కేయూ ఎంబీఏ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.మురళీకృష్ణ, అనంతలక్ష్మి స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ సురేంద్ర నాయుడు, ప్రొఫెసర్ ఎం.ప్రభాకర్, డాక్టర్ సీహెచ్ కృష్ణుడు, డాక్టర్ వి.శైలజ తదితరులు పాల్గొన్నారు.


ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర కీలకం



డ్రైవర్‌కు బహుమతి అందజేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర కీలకమని వక్తలు అన్నారు. శనివారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ఆర్టీసీ ఆవరణలో ఉత్తమ డ్రైవర్లను అభినందించారు. కొన్నేళ్లుగా ప్రమాదాలు లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురు డ్రైవర్లను అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్టీసీ సీటీఎం శ్రీలక్ష్మి, డిప్యూటీ చీఫ్ మెకానికల్ మేనేజర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గమే సర్వ శ్రేష్టం



మాట్లాడుతున్న విద్యారణ్య భారతీ మహాస్వామీజీ

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మిక మార్గమే సర్వ శ్రేష్టమని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ మహాస్వామీజీ అన్నారు. ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న సహస్రఘట మహా కుంభాభిషేక వేడుకలకు వచ్చిన స్వామీజీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అనుగ్రహ భాషణం చేశారు. ఆధ్యాత్మిక మార్గం విశిష్టతను వివరించారు. అంతకు ముందు ఉదయం 108 జంటలతో సామూహికంగా గణపతి, నవగ్రహ,లక్ష్మీనారాయణ హోమాలు జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టపర్తి రమణారెడ్డి మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం పెద్ద ఎత్తున మహా కుంభాభిషేక వేడుకలు స్వామీజీ ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు.

సమయం లేదు.. సాధన చేద్దాం

విద్యార్థి దశలో పదో తరగతి కీలకం. పదో తరగతి పరీక్షల్లో సాధించే మార్కులతోనే భవిష్యత్ ముడిపడి ఉంటుంది. మార్చి 17 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సమయం దగ్గర పడుతుండటంతో ఇటు విద్యార్థులు.. అటు తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలైంది. ఈ ఏడాది మంచి ఫలితాల సాధనకు ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా సందేహాలను నివృత్తి చేస్తున్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రణాళిక ప్రకారం చదివితే మంచి ఫలితాలు సాధించొచ్చని నిపుణులు చెబుతున్నారు.



ఆత్మకూరులో చదువుకుంటున్న విద్యార్థులు

- సమీపిస్తున్న పదో తరగతి పరీక్షలు
- ప్రణాళికతో చదివితే మంచి మార్కులు
- పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ
- ఉత్తమ ఫలితాల సాధనకు శ్రమిస్తున్న ఉపాధ్యాయులు

నియోజకవర్గ వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థుల వివరాలు

మండలం	విద్యార్థుల సంఖ్య
రాప్తాడు	914
ఆత్మకూరు	331
కనగానపల్లి	315
చెన్నేకొత్తపల్లి	200
రామగిరి	466

ఆత్మకూరు: నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది కంటే ఉత్తీర్ణత శాతం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం విద్యార్థులను నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. సమయాన్ని వృథా చేయకుండా శ్రద్ధగా చదువుకోవాలని సూచిస్తున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకూ.. అలాగే సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక ప్రణాళికతో తరగతుల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ప్రణాళికా బద్ధంగా విద్యాబోధన చేస్తూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. కీలక అంశాలను పదే పదే వివరిస్తూ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు. తరగతిలో వెనుకబడిన వారిని గుర్తించి, వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా పాఠ్యాంశాల్లోని ముఖ్యమైన ప్రశ్నలపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు.

స్నాక్స్ ఇస్తే మరింత ఉత్సాహం..

గతంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించే సమయాల్లో దాతలు బిస్కెట్స్, చెక్కీలు, మజ్జిగ ఇస్తూ ప్రోత్సహించే వారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చదివిన విద్యార్థులు నీరస పడకుండా ఉత్సాహంతో చదువుకునే వారు. ఈ ఏడాది కూడా ఎవరైనా దాతలు విద్యార్థులకు స్నాక్స్ అందిస్తే మంచిదని ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా శ్రమిస్తున్నాం. ప్రస్తుతం వంద రోజుల ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించి, సబ్జెక్టుల్లో సందేహాలను నివృత్తి చేస్తున్నాం. విద్యార్థులకు రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించి చదివిస్తున్నాం. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చదువుకోవాలి.

– నరసింహారెడ్డి, ఎంఈఓ

మంచి మార్కులు సాధిస్తా..



సిలబస్ అంతా పూర్తి అయింది. టైమ్ టేబుల్ వేసుకుని చదువుకుంటున్నా. కీలకమైన ప్రశ్నలను పునశ్చరణ చేస్తున్నాను. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తాననే నమ్మకం వచ్చింది. ఉపాధ్యాయులు కూడా దగ్గరుండి పాఠ్యాశాలు అర్థమయ్యేలా బోధిస్తున్నారు.

– చరిత, ఆత్మకూరు కేజీబీవీ

స్టడీ అవర్స్‌తో ఉపయోగం



పాఠశాలలో ఉదయం, సాయంత్రం పూట నిర్వహించే స్టడీ అవర్స్ ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. పరీక్షలకు సమయం దగ్గర పడుతుం డటంతో అందుకు అనుగుణంగా సబ్జెక్టులపై దృష్టి పెడుతున్నాను. గణితం, ఇంగ్లిష్, సైన్స్ పాఠ్యాంశాలను పునశ్చరణ చేస్తున్నాను.

– భార్గవి, ఆత్మకూరు కేజీబీవీ

మాజీ మంత్రి శైలజానాథ్‌తో భేటీ



మాజీ మంత్రి శైలజానాథ్‌తో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ఆదర్శనగర్‌లో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ సాకే శైలజానాథ్‌ను మేయర్ వసీం శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, కార్పొరేటర్ కమల్ భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అన్నమయ్య జిల్లా మదనపల్లిలో గౌతమి అనే మహిళపై యాసిడ్‌తో దాడి చేసి కత్తితో పొడిచిన గణేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం టవర్ క్లాక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులపై ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, అత్యాచారాలు తీవ్రంగా పెరిగాయన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై సమగ్రమైన విచారణ చేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దు, ఉపాధ్యక్షుడు గిరి, సహాయ కార్యదర్శి శివ, సోము, ఐద్వా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు చంద్రిక, అశ్విని, రేణుక పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న వీసీ సుదర్శనరావు, డీటీసీ వీర్రాజు

అనంతపురం సెంట్రల్: విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు సూచించారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో శనివారం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో రహదారి భద్రతా మాసోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నియమాలు పాటించే విధంగా చూడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఉప రవాణా కమిషనర్ వీర్రాజు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలపై అవగాహన తీసుకొచ్చేందుకు రహదారి భద్రతా మాసోత్సవాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు. గత నెల రోజుల్లో 64 అవగాహన సదస్సులు, హైస్కూల్స్, జూనియర్ కాలేజీల్లో లక్షల మంది విద్యార్థులను భాగస్వాములను చేసినట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 543 మంది వాహన డ్రైవర్లకు పరీక్షలు చేయించినట్లు వెల్లడించారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీఓ సురేష్‌నాయుడు, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐఓ శ్రీనివాస్ నాయక్, ఆర్టీఓ రమేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాయల్ మధు వేధింపులు

అనంతపురం: టీడీపీ నేత రాయల్ మధు వేధింపులు కొనసాగుతున్నాయి. మూడు వారాల క్రితం ఓ మైనార్టీ వ్యక్తిపై దాడి చేసి భయభ్రాంతులకు గురి చేసిన సంగతి విదితమే. తాజాగా అనంతపురం మాజీ కార్పొరేటర్ సుజాత కొడుకు రోహిత్ యాదవ్‌ను భయభ్రాంతులకు గురి చేశారు. రోహిత్ యాదవ్ సెల్ఫీ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'నేను బెంగళూరులో ఉంటూ వ్యాపారం చేసుకుంటున్నాను. అయినప్పటికీ రాయల్ మధు.. మీ పాఠశాలలో అడ్మిషన్లు కానివ్వను. నీ అంతు చూస్తానంటూ బెదిరిస్తున్నాడు. 2021లో ఆయన విజయానికి పని చేసినందుకు మాకీ బహుమానం ఇస్తున్నారా? ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాను. ఇలాగే వేధింపులు కొనసాగితే.. విషం తాగి ఆత్మహత్య చేసుకోవడం తప్ప వేరే మార్గం లేదు.' అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికైనా పోలీసులు చర్యలు తీసుకుని రాయల్ మధు దౌర్జన్యాలను అరికట్టాల్సిన అవసరం ఉంది. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అనంతపురం పోలీసుల అండ చూసుకుని రాయల్ మధు రెచ్చిపోతున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో) అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక గ్రామంలో కొండల్లో వెలసిన భక్తుల కొంగు బంగారమైన గుంటికింద సుబ్రమణ్యేశ్వరస్వామి రథోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ఏకవార రుద్రాభిషేకం, సహస్ర నామార్చన వంటి కార్యక్రమాలు ప్రధాన అర్చకుడు రామాచార్యులు చేశారు.స్వామి వారికి నివాస గ్రామమైన కోటంకలో సుబ్రమణ్యేశ్వరస్వామి వెండి విగ్రహాలను రంగు రంగుల విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించిన రథంలో ఉంచి, పుర వీధుల్లో రాత్రి స్వామి రథోత్సవం ప్రారంభించారు.ఈ సందర్భంగా భక్తులు భజన కీర్తనలతో మేళతాళాలతో స్వామి వారిని ఊరేగిస్తూ రథాన్ని స్వామి వారి సన్నిధికి చేర్చారు. రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక జిల్లా నలమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అలాగే కొండల్లో వున్న స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకు న్నారు. తిరునాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి పోలీస్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

'పొలానికి నిప్పు పెడుతోంది వారే'



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన రైతులు పెద్ద ఓబులేష్, వసంత్

రాప్తాడు: మండలంలోని పుల్లలరేవు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్ద ఓబులేష్, వసంత్‌కు చెందిన పొలానికి గుర్తు తెలియని వ్యక్తులు వరుసగా నిప్పు పెడుతున్న విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి మరోసారి పొలానికి నిప్పు పెడుతుండగా రైతులు గుర్తించారు. పట్టుకునేందుకు ప్రయత్నించే లోపు పరారయ్యారు. బాధిత రైతులు తెలిపిన వివరాలు.. పెద్ద ఓబులేష్ తన బంధువులతో కలసి నిప్పు పెడుతున్న వారిని ఎలాగైనా పట్టుకోవాలని శుక్రవారం రాత్రి కాపు కాచాడు. గ్రామానికి చెందిన తలారి విజయ్ కుమార్, తలారి అనిల్ కుమార్, సునీల్ ముగ్గురు కలిసి మరోసారి నిప్పు పెట్టడానికి ద్విచక్ర వాహనంలో వచ్చారు. ఒకరు ద్విచక్ర వాహనంలో అలాగే కూర్చొని ఉండగా.. ఇద్దరు వచ్చి నిప్పు పెడుతుండగా పట్టుకునే ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన వారు ద్విచక్ర వాహనంలో పారిపోయారు. పొలానికి నిప్పు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం బాధిత రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కంపు.. కంపు



మురుగు ప్రవహించడంతో వాహనదారుల అవస్థలు

నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, ప్రజారోగ్యాధికారుల వైఫల్యం ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తోంది. రాంనగర్ ఫ్లై ఓవర్ కింద వైపు గత కొన్ని నెలలుగా డ్రైనేజీ సమస్య వేధిస్తోంది. డ్రైనేజీ బ్లాక్ కావడంతో రోడ్లపై మురుగు ప్రవహిస్తోంది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందిస్తారో లేదో వేచి చూడాలి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

సంక్షిప్త సమాచారం

ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

అనంతపురం కల్చరల్: జిల్లాలోనే పది ముఖాలతో రాతి స్తంభ మందిరంలో కొలువుదీరిన కామితార్థ మహా గణపతి పంచాయతన స్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవాలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు సత్యనారాయణ నేతృత్వంలో పీటీసీ ప్రాంగణంలోని దేవతామూర్తుల ముందు వాస్తు హోమం, సహస్ర గణపతి హోమాలు, అర్చనలు జరిగాయి. భక్తులందరూ విచ్చేసి తీర్థప్రసాదాలను స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

కూరగాయల సాగుపై అవగాహన

అనంతపురం సెంట్రల్: నిరంతరం ఆదాయాన్నిచ్చే పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం డీపీఎం, సీటీఐఓ లక్ష్మానాయక్ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌కు సమీపంలో జెడ్‌బీఎన్ఎఫ్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఎనీటైమ్‌మనీ (ఏటీఎం) పంటల సాగుపై 56 మందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పండ్ల తోటల్లో కూరగాయలు, దుంప జాతి, ఆకుకూరలు సాగుపై అవగాహన కల్పించారు. శిక్షణలో తీసుకున్న అంశాలను రైతులకు తెలియజేసి వ్యవసాయం లాభసాటి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సాంకేతికత అందిపుచ్చుకుంటే ఉజ్వల భవిష్యత్తు

అనంతపురం రూరల్: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పీవీకేకే కళాశాల చైర్మన్ పల్లె వెంకట కృష్ణకిశోర్ పేర్కొన్నారు. పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగంలో ఎంబెడెడ్ సిస్టంపై రెండు రోజులుగా నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వీఐటీలో పోస్టర్ ప్రజెంటేషన్

రాప్తాడు: హంపాపురంలోని ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఆర్ఎన్‌డీ ఆధ్వర్యంలో సైన్స్ అండ్ టెక్నాలజీపై కళాశాల ఫస్ట్ ఇయర్ విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీ.బీ.ఆర్.శర్మ, చైర్మన్ క్రిష్టా రెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, ఏఓ వెంకట శివారెడ్డి, హెచ్‌అండ్ఎస్ విభాగపతి మధుసూదన్ రెడ్డి, ఆర్ఎన్‌డీ డైరెక్టర్ రాఘవ రాజు తదితరులు పాల్గొన్నారు.

జీసీటీఏ డైరీ ఆవిష్కరణ

అనంతపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం నూతన డైరీని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్ బాబు, జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంఘం అధ్యక్షుడు కోనంకి శ్రీధర్, కార్యదర్శి డాక్టర్ ఎం.బాలాజీ నాయక్, ఆర్ట్స్ కళాశాల యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ డి.చంద్రశేఖర్, డాక్టర్ బి.తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూ ఘన విజయం

అనంతపురం: ఏపీ వెటరెన్స్ క్రికెట్ అసోసియేషన్, ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫాదర్ ఫెర్రర్ ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా శనివారం ఎస్కేయూ, డీఎంహెచ్ఓ జట్లు పోటీపడ్డాయి. డీఎంహెచ్ఓ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. రామాంజనేయులు 45 బంతుల్లో 89 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎస్కేయూ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి 167 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. సాయికృష్ణ కేవలం 17 బంతుల్లో 50 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచారు. ఇలియాజ్ 22 బంతుల్లో 40 పరుగులు, ప్రణీత్ 22 బంతుల్లో 38 పరుగులు చేసి జట్టు గెలుపునకు కృషి చేశారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

అనంతపురం రూరల్: ఉరవకొండ మండలం రాకెట్ల ఎస్సీ ప్రభుత్వ వసతి గృహం విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న వార్డెన్, ఏఎస్‌డబ్ల్యూఓపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వీ డిమాండ్ చేశారు. శనివారం సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ (ఇన్‌చార్జ్) రాధికకు వినతిపత్రం అందజేశారు. ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్ పాల్గొన్నారు.

భూకబ్జాపై కేసు నమోదు

అనంతపురం: హెచ్చెల్సీ కాలనీలోని ఓ ప్రైవేట్ భూమి ప్రహరీని ధ్వంసం చేసి, తాత్కాలిక గుడిసెలు వేసి కబ్జాకు పాల్పడిన వారిపై అనంతపురం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు.. బుక్కరాయసముద్రం మండల కేంద్రం టీచర్స్ కాలనీకి చెందిన కసిరెడ్డి సూర్యనారాయణ రెడ్డికి తన తండ్రి నుంచి వారసత్వంగా హెచ్చెల్సీ కాలనీలో సర్వే నంబర్ 95/1బీలో 64 సెంట్ల భూమి భాగ పరిష్కారంలో కేటాయించారు. ఈ 64 సెంట్ల భూమిలో అతడి కుమార్తె రెడ్డి భారతికి 21 సెంట్ల భూమిని బహుమతిగా ఇచ్చారు. తక్కిన భూమి చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నారు. ఫిబ్రవరి 2వ తేదీన కొంత మంది వ్యక్తులు ఓ ప్రజా సంఘం పేరు చెప్పి భూమిలోకి అక్రమంగా ప్రవేశించారు. ప్రహరీని ధ్వంసం చేసి, తాత్కాలిక గుడిసెలు నిర్మించారు. కసిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. ఇంకా మరికొందరిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

దళితులపై దాడులు అమానుషం

అనంతపురం కల్చరల్: దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులపై పోరాడాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని జెడ్పీ కార్యాలయం ఎదుట ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీలపై దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. ఇతర రాష్ట్రాలతో పాటూ పొరుగున ఉన్న కర్నూలులో దళితురాలు గుండమ్మపై ఏకంగా ట్రాక్టర్ మీదకు ఎక్కించి తగులబెట్టి బీభత్సం సృష్టించిన చర్యలు తీసుకోలేదన్నారు. పోరాడి హక్కులు సాధించుకుందామని పిలుపునిచ్చారు.

థూ.. ఏం ఆఫీసయ్యా ఇది!

- 12వ డివిజన్ కార్పొరేటర్ ఓవరాక్షన్

అనంతపురం కార్పొరేషన్: 12వ డివిజన్ కార్పొటర్ బాబాఫక్రుద్దీన్ ఓవరాక్షన్ చేశాడు. శనివారం కమిషనర్ చాంబర్‌లోకి ఎందుకు పంపరంటూ నానా యాగీ చేశాడు. వివరాలు.. గతంలో వైఎస్సార్‌సీపీ తరఫున నెగ్గిన బాబాఫక్రుద్దీన్.. ఎన్నికలకు ముందు టీడీపీలోకి జంప్ అయ్యాడు. కాగా శనివారం నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తన చాంబర్‌లోకి వెళ్లారు. అంతలోనే కార్పొరేటర్ బాబా డోర్ తీసి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించాడు. కమిషనర్ ఐదు నిమిషాల్లో పిలుస్తానని చెప్పారు. దీంతో కార్పొరేటర్ బాబా ఆగ్రహంతో ఊగిపోయాడు. కార్పొరేటర్లంటే లెక్క లేదా.. థూ.. ఇదేం ఆఫీస్? థూ..థూ అంటూ ఉమ్మి వేస్తూ చిందులు తొక్కాడు. కాసేపటికి ఎవరూ పట్టించుకోకపోవడంతో నగరపాలక సంస్థ గేట్‌ను మూసి వేస్తూ హంగామా చేశాడు. చివరకు కమిషనర్ బాలస్వామి అధికార పార్టీలోకి జంప్ అయిన కార్పొరేటర్ కదా.. ఏదో విధంగా నచ్చజెప్పాలని తన చాంబర్‌కు తీసుకెళ్లారు. 2014–19 టీడీపీ ప్రభుత్వంలోనూ ఇలాంటి పరిస్థితులను ఎన్నో చూశాం. వైఎస్సార్‌సీపీ పాలకవర్గం ముగియకుండానే టీడీపీ నాయకులు కోరలు చాస్తుండటంతో అధికారులు భయాందోళనకు గురవుతున్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



ఆర్ట్స్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్/అనంతపురం సెంట్రల్/ఆత్మకూరు/రాప్తాడు/అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాల వ్యాప్తంగా శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. అనంతపురంలోని మున్సిపల్, రవాణ శాఖ కార్యాలయాలు, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పరిసరాలను శుభ్రం చేశారు. రాప్తాడు, ఆత్మకూరులో స్వచ్ఛతపై అధికారులు ప్రతిజ్ఞ చేయించారు.

బెస్ట్ టెక్నికల్ పేపర్ అవార్డుకు ఎంపిక

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని మెకానికల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కె.కళ్యాణి రాధ, డాక్టర్ బి.ఓం ప్రకాష్‌కు సర్టిఫికెట్ ఆఫ్ బెస్ట్ టెక్నికల్ పేపర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఎన్ఐటీ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లో థర్మో-ఫ్లూయిడ్ ఇంజినీరింగ్ అండ్ సైన్సెస్ అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో వీరు ఒక టెక్నికల్ పేపర్‌ను ప్రజెంట్ చేయడంతో బెస్ట్ టెక్నికల్ పేపర్‌కు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన అసిస్టెంట్ ప్రొఫెసర్లను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. చెన్నారెడ్డి అభినందించారు.